క్లుప్తంగా...

వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన హెచ్ఆర్డీ బృందం

ఏజీవర్సిటీ: ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగాం పై 15 రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తోంది. దేశంలోని అనేక విశ్వవిద్యాలయాలు, కళాశాలల వివిధ ఫ్యాకల్టీ విభాగాలకు చెందిన 30 మంది అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.ఇందులో భాగంగా గురువారం క్షేత్రస్థాయి పర్యటనలో ఈ బృందం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం,అగ్రిహోబ్‌ను హెచ్ఆర్డీ బృందం సందర్శించింది.

కొండా లక్ష్మణ్‌కు ఘన నివాళి



ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో శ్రీ కొండా లక్ష్మణ్ 11వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయంలో కళాశాల అసోసియెట్ డీన్ చీనా నాయక్ లక్ష్మణ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు అన్నదాన కార్యక్రమం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణనాథుని వద్ద శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు గణనాథుని పూజ కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు.

ఉప కమిషనర్‌ను కలిసిన దేవాలయ కమిటీ సభ్యులు



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవి కుమార్‌ను బుద్వేల్ వీరభద్ర స్వామి, భద్రకాళి దేవాలయం కమిటీ సభ్యులు గురువారం కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా దేవాలయం వద్ద జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఉప కమిషనర్‌కు వివరించారు. కార్యక్రమంలో అధ్యక్షులు దేవదాస్, కార్యదర్శి సత్యనారాయణ గౌడ్, కోశాధికారి నర్సింహా, పి.శ్రీనివాస్, పెండ్యాల శ్రీధర్ తదితరులు ఉన్నారు.

వినాయకుడికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని గణేష్‌నగర్ లోని బంగారు మైసమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు 'మనూ' ఐటీఐ అడ్మిషన్ కౌన్సెలింగ్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఇండస్ట్రియల్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్(ఐటీఐ)హైదరాబాద్‌లో ఉన్న ఖాళీ సీట్ల భర్తీ కోసం అడ్మిషన్ కౌన్సిలింగ్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఐటీఐ ప్రిన్సిపల్ డాక్టర్ అర్షియా ఆజమ్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి గచ్చిబౌలిలోని ఉర్దూ యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఐటీఐ భవనం లో కౌన్సిలింగ్‌ను నిర్వహిస్తామన్నారు. అందుకోసం అర్హులైన వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో వ్యక్తిగతంగా కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నెంబర్ 040–23008428, సెల్ నెంబర్ 9440692452 లో సంప్రదించాలని కోరారు.

వృద్ధుడి అదృశ్యం



గచ్చిబౌలి: చెప్పాపెట్టకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మసీద్‌బండలో నివాసం ఉంటున్న నక్క లక్ష్మణ్(55) ఈ నెల 16న ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రైనా తిరిగి రాకపోవడంతో సమీప ప్రాంతాలలో గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. కొడుకు రమేష్ గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భళా.. బిహార్ మేళా





శిల్పారామంలో నిర్వహిస్తున్న బిహార్ కనెక్ట్ మేళాలో ఆకట్టుకుంటున్న స్టాల్స్ లెదర్, జూట్, స్టోన్ కార్వింగ్ ఉత్పత్తులు

- శిల్పారామంలో ఆకట్టుకుంటున్న బిహార్ చేనేత హస్తకళా మేళా
- ఈనెల 25 వరకు కొనసాగనున్న మేళా
- ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న స్టోన్, ఉడ్ కార్వింగ్ ఉత్పత్తులు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న బిహార్ చేనేత హస్తకళా మేళా సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. బిహార్ కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను నగరవాసులు విరివిగా కొనుగోలు చేస్తున్నారు. ఉపేంద్ర మహారథి శిల్ప అనుసంధాన్ సంస్థాన్ బిహార్ రాష్ట్ర ప్రభుత్వం అధ్వర్యంలో ఈనెల 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. బిహార్ కనెక్ట్ 2023 పేరిట ఎర్పాటు చేసిన ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకట్టుకుంటోంది. ఈ ప్రదర్శన ఉదయం 10గంటల నుంచి రాత్రి 8గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



- కళాకారులు తయారు చేసిన మధుబని పెయింటింగ్ చీరలు, ఖాదీ షర్టులు, జూట్ ఉత్పత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.
- బగల్‌పురి చీరలు, ఖేతా ఎంబ్రయిడరీ, స్టోన్ కార్వింగ్, బ్లాక్ ప్రింటింగ్, సిక్కిఆర్ట్, నలంద లాక్ బ్యాంగిల్స్, చెక్కక్రాఫ్ట్, టికులీ పేయింటింగ్, మంజూషా పేయింటింగ్, హ్యాండ్‌లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్ తదితర ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి.

మేళాలో భాగంగా ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు....

మేళాలో బాగంగా సందర్శకులను ఆకట్టుకునేందుకు ప్రతి రోజు సాయంత్రం 5 గంటలకు ఆంపిథియోటర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కూచిపూడి, భరతనాట్యం, ఒడిస్సి, సంగీత కచేరాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు తమ నృత్యాలతో సందర్శకులను అలరిస్తున్నారు.

ఆకట్టుకుంటున్న మధుబని పెయింటింగ్ జూట్ ఉత్పత్తులు...

మేళాలో ఏర్పాటు చేసిన జూట్ ఉత్పత్తులు ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్రత్యేకంగా జూట్ బ్యాగులపై మధుబని పెయింటింగ్ వేసి ఆకట్టుకుంటున్నారు. కళాకారులు, మహిళల కోసం హ్యాండ్ బ్యాగులు, ల్యాప్‌టాప్ బ్యాగులు, స్కూల్ బ్యాగ్స్, ఫైల్ చేసేందుకు ఉపయోగించే బ్యాగ్స్ ఆకట్టుకుంటున్నాయి. వీటి ధర రూ.100 నుంచి 3వేల వరకు అందుబాటులో ఉన్నాయి.

ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న స్టోన్, వుడ్ కార్వింగ్ విగ్రహాలు

కళాకారులు తయారు చేసిన ఉడ్ కార్వింగ్, స్టోన్ కార్వింగ్ ఉత్పత్తులు ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఆరు అంగుళాల, ఫీట్ కార్వింగ్ విగ్రహాలు అందుబాటులో ఉన్నాయి. ఆర్డర్‌పై ఎంతపెద్ద విగ్రహాలను అయిన తయారు చేస్తామని కళాకారులు తెలుపుతున్నారు. వీటి ధర రూ.150 రూపాయల నుంచి 3వేల వరకు అందుబాటులో ఉన్నాయి. ఎక్కువ శాతం నల్లరాతితో విగ్రహాలు తయారు చేస్తున్నట్టు తెలిపారు. శివలింగాలు, గణేశ్, హనుమాన్, బుద్ధ విగ్రహాలు తదితర దేవీదేవతా మూర్తుల విగ్రహాలు అందుబాటులో ఉన్నాయి.

ఆకర్షణగా నిలుస్తున్న లేదర్ బ్యాగ్స్

కళాకారులు తయారు చేసిన లేదర్‌బ్యాగ్స్ ఆకర్షణగా నిలుస్తున్నాయి. మహిళలకు కావాల్సిన వివిధ రకాల బ్యాగ్స్, పెయింటింగ్ బ్యాగ్స్, స్కూల్ బ్యాగ్స్, ల్యాప్‌టాప్ బ్యాగ్స్ వివిధ రకాల డిజైన్‌లతో అందుబాటులో ఉన్నాయి.





మేళాలో ఆకట్టుకుంటున్న మధుబని పేయింటింగ్, ఇత్తడితో చేసిన దేవీదేవతామూర్తుల విగ్రహాలు, కొనుగోలు చేస్తున్న సందర్శకులు

ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందాలి



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని, అలాంటి వారు తనను సంప్రదించాలని ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ అన్నారు. నెక్నాంపూర్ గ్రామానికి చెందిన టి. సతీష్ ప్రసాద్ ఇటీవల ఆసుపత్రిలో చికిత్స పొందటంతో ఆయనకు మంజూరు అయిన ముఖ్యమంత్రి సహాయ నిధి రూ.60వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో అమలు అవుతున్నాయన్నారు. రాష్ట్రంలో ఆదాయాన్ని పెంచటం, దాన్ని పేదలకు పంచటమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు నీలేష్ ప్రసాద్ దూబే, నాయకులు బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్డు దారులు కేవైసీని నమోదు చేసుకోవాలి

రాజేంద్రనగర్: రేషన్ కార్డుదారులు తప్పనిసరిగా తమ కైవీసీని నమోదు చేసుకోవాలని సరూర్‌నగర్ ఏఎస్ఓ బాలసరోజ సూచించారు. ప్రజాపంపిణీ ద్వారా అందజేస్తున్న రేషన్ సరుకులు పక్కదారి పట్టకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు సరూర్‌నగర్ సర్కిల్ –3 పరిధిలోకి వచ్చే రాజేంద్రనగర్, శేరిలింగపల్లి, ఎల్బీనగర్ (పాక్షికంగా) వచ్చే డీలర్లకు గురువారం సమావేశమై వివరాలు వెల్లడించారు. గురువారం నుంచే ఆయా రేషన్ షాపుల వద్దే కార్డులో ఉన్న లబ్ధిదారులు తమ వేలిముద్రల ద్వారా కేవైసీని నమోదు చేసే ప్రక్రియవ వేగవంతమం చేయాలన్నారు. కైవైసీపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. రేషన్ కార్డులో ఉన్న వారిలో కొందరు మరణించడం. వివాహాలు జరిగి ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పటికి వారు కార్డుల్లో యధాతథంగా సరుకులు పొందుతున్న కారణంగా కై వైసీని తప్పనిసరి చేసినట్లు తెలిపారు. వారం రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించినట్లు సమాచారం.

నూతన కార్యవర్గం ఎన్నిక



మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మెడికల్ షాపు యజమానుల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా డ్రగిస్ట్, కెమిస్ట్ మెడికల్ షాపు నిర్వాహకుల ఆధ్వర్యంలో పాత కమిటీని రద్దు చేసి ఏకగ్రీవంగా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడుగా పాము చంద్రశేఖర్ ,ఉపాధ్యాక్షులుగా దాసరి వివేకనంద,చందరి కొండల్ ,ప్రధాన కార్యదర్శిగా గూడ శ్రీనివాస్,జాయింట్ సెక్రటరిగా ఎస్ తిరుమలరావు,పులిప్రసాద్ తదితరులు ఎన్నికయ్యారు.

నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఉప కమిషనర్



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఉప కమిషనర్ రవి కుమార్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పల్లె చెరువు, పత్తికుంట, మీరాలం చెరువుల వద్ద వినాయక నిమజ్జనాల కోసం క్రేన్‌లను ఏర్పాటు చేసినట్లు ఉప కమిషనర్ రవి కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం సర్కిల్ గణేష్ ఉత్సవ కమిటీ కార్యదర్శి వై.శ్రీధర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన నిమజ్జన పరిస్థితులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పత్తికుంట వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... ప్రస్తుతం పత్తికుంట వద్ద నిమజ్జనానికి ఒక క్రేన్‌ను ఏర్పాటు చేశామన్నారు. 7వ రోజు రెండు క్రేన్‌లు, 9 నుంచి 11వ రోజుకు మూడు క్రేన్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. మీరాలం ట్యాంక్ వద్ద ఒక క్రేన్‌తో నిమజ్జనాన్ని కొనసాగిస్తున్నామన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో



అంబేద్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రాజేంద్రనగర్: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఉదయం ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ చౌరస్తా వద్ద ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చౌరస్తాలో రాస్తారోకోకు దిగారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... పది రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా పార్లమెంటులో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి చట్ట భద్రత కల్పించాలన్నారు.

ఆలయ గోపురం పనుల పరిశీలన



శంషాబాద్ రూరల్: మండలంలోని నర్కూడ శివారులో ఉన్న అమ్మపల్లి (శ్రీసీతారామచంద్ర స్వామి) ఆలయ గోపురం పనులను గురువారం ఆలయ ట్రస్టు చైర్మన్‌తో కలిసి దాత పరిశీలించారు. ప్రధాన గోపురం పనుల కోసం దాత, జెడ్పీటీసీ తన్వీరాజు ముందుకు రాగా.. ఆర్కిటెక్చర్ భావన రెడ్డి సారథ్యంలో పనులు కొనసాగుతున్నాయి. పనులు తుది దశకు చేరుకోగా.. త్వరగా పూర్తి చేసేలా కృషి చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు చైర్మన్ వినోద్‌కుమార్, కమిటి డైరక్టర్లు శ్రీనివాస్, కృష్ణ, అశోక్, లావణ్యవిశ్వనాథం , మాలతిచంద్రశేఖర్‌గౌడ్, సొసైటీ డైరక్టర్ శివాజీ, స్థానికులు గోపాల్, శ్రీశైలం, వినోద్‌కుమార్, జంగయ్య, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పరిశీలించిన మేయర్



బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దర్గా నుంచి కిస్మత్‌పూర్, రాక్‌చర్చి నుంచి కిస్మత్‌పూర్ వివేకనంద విగ్రహం వరకు చేపడుతున్న రోడ్ల నిర్మాణ పనులను గురువారం మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంబాలను వెంటనే తొలగించి పక్కకు ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు. అదే విధంగా విల్లాలు, అపార్ట్‌మెంట్‌లలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ లైన్లు, వాటర్ పైప్‌లైన్లను త్వరతిగతిన ఏర్పాటు చేస్తే మళ్లీ రోడ్ల తవ్వే అవసరం ఉండదని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ శరత్‌చంద్ర, ఏఈఈఈ రాజ్ కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

యూ ట్యూబ్ చూసి చైన్ స్నాచింగ్



పోలీసుల అదుపులో చైన్‌స్నాచర్

శంషాబాద్: ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కేందు అడ్డదారి తొక్కాడు. యూటూబ్‌లో చైన్‌స్నాచింగ్ వీడియోలు చూసి వరస చోరీలకు పాల్పడుతూ చివరికి కటకటాల పాలయ్యాడు. శంషాబాద్ డీసీపీ నారాయణ రెడ్డి తెలిపిన మేరకు.. రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ పాండురంగానగర్‌కు బస్తీకి చెందిన కుర్మటి వెంకట్రామ్‌యాదవ్ (40) ఫాస్ట్‌ఫుడ్ వ్యాపారంతో పాటు షేర్‌మార్కెట్‌లో పెట్టుబడి పెట్టి నష్టం రావడంతో అప్పుల పాలయ్యాడు. వాటిని నుంచి గట్టెక్కేందుకు చైన్‌స్నాచింగ్ ఎంచుకున్నాడు. యూట్యూబ్‌లో చైన్‌స్నాచింగ్‌కు సంబంధించిన వీడియోలు చూసి వాటిని అమలు చేయడం ప్రారంభించాడు. ఈ ఏడాది జులై 15 మోకిల వద్ద తొలిసారి మహిళ మెడలోని పుస్తెలతాడును చోరీ చేశాడు. ఆగస్టులో కొత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మరోసారి మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ చేసి పరారయ్యాడు. ఈ నెల 13 నుంచి 17లోపు నందిగామలో రెండు చోట్ల నార్సింగిలో ఓ చోట మహిళ మెడలో పుస్తెలతాళ్లు చోరీ జరిగిన కేసుల్లో నందిగామ పోలీసులు, సీసీఎస్ పోలీసులు దృష్టి సారించారు. సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలు సేకరించారు. గురువారం ఉదయం నందిగామలోని అయ్యప్పదేవాలయం సమీపంలో సంచరిస్తున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి 12 తులాల బంగారు ఆభరణాలు, రెండు ఫోన్లు ఓ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కేసును చేధించిన సీసీఎస్, నందిగామ పోలీసులను డీసీపీ ఈ సందర్భంగా అభినందించారు.

మహిళా బిల్లు ఆమోదంపై సంబరాలు

అత్తాపూర్: పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా ఉప్పర్‌పల్లి చైతన్య విలాస్ కాలనీలో మహిళలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ రంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి ఎం.వనితా రెడ్డి మాట్లాడుతూ... దేశంలో మహిళల మూడు దశాబ్దాల ఆకాంక్షను ప్రధాని నరేంద్ర మోదీ నెరవేర్చారన్నారు. కార్యక్రమంలో రామ తులసి, సువర్ణ భార్గవి పాల్గొన్నారు.



సంబరాల్లో పాల్గొన్న బీజేపీ రంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి వనితా రెడి

గణనాథుడికి ప్రత్యేక పూజలు

వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మణికొండ, నార్సింగి, శంషాబాద్ మున్సిపాలిటీలతో పాటు బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి తదితర డివిజన్‌లలో భక్తి శ్రద్ధలతో వినాయకుని పూజలు నిర్వహిస్తున్నారు.

\- మణికొండ



శ్రేయ హోమ్స్ అపార్ట్‌మెంట్స్‌లో..



పుప్పాలగూడ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కాలనీలో..



నార్సింగిలో..



మణికొండ శివపురి కాలనీలో..



కేపీఆర్ కాలనీలో..